# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎరువుల ధరలు పెంచి అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కోరారు.
- రాష్ట్రంలో తొలి ప్రకృతి వైద్య కళాశాల విశాఖపట్నంలో ఏర్పాటు కానుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో రానున్న 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణం కేంద్రం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట..” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.

==========================

ఎరువుల ధరలు పెంచి అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల లభ్యత, సరఫరాపై ముఖ్యమంత్రి ఈ రోజు శ్రవణమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాల వారీగా ఎరువుల లభ్యత, సరఫరా వివరాలపై ఆరా తీశారు. విజిలెన్స్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. యూరియా, ఎరువుల నిల్వల తనిఖీ చేపట్టాలని, వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. ఎరువులు నల్ల బజారుకు తరలిస్తే కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రైవేటు డీలర్లకు ఎరువుల కేటాయింపు తగ్గించి మార్క్‌ఫెడ్ ద్వారానే ఎక్కువగా సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. యూరియా సరఫరా విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలన్నారు.

==========================

రాష్ట్రంలో తొలి ప్రకృతి వైద్య కళాశాల విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. విశాఖలోని విమ్స్ ప్రాంగణంలో 16 కోట్ల 40 లక్షల రూపాయలతో చేపట్టిన ఈ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ కోర్సులో ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగ శాల కూడా విశాఖ నగరంలోనే ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. కాకినాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 50 పడకలతో ఆయుష్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని వివరించారు. ధర్మవరం, కాకినాడలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

==========================

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఈ రోజు పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పర్యావరణాన్ని కలుషితం చేసే పదార్థాలతో రూపొందించే విగ్రహాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేడుకలు నిర్వహించాలని భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

==========================

వచ్చే సంవత్సరం జరిగే 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీఓ) సదస్సుకు విశాఖపట్నం అతిథ్యం ఇవ్వనుందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. ఒడిశాలోని పూరీలో ఈ రోజు నిర్వహించిన 40వ ఐఏటీఓ వార్షిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను, ప్రభుత్వం పెట్టుబడిదారులకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను, ఆంధ్రప్రదేశ్ లో పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా... తదితర అంశాలను అజయ్ జైన్ వివరించారు.

==========================

సీపీఐ అగ్రనేత, నల్గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఈ రోజు హైదరాబాద్ లో హిమాయత్ నగర్‌లోని సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సురవరం సేవల్ని గుర్తు చేసుకున్నారు. సుధాకర్ రెడ్డితో తనకు సదీర్ఘ రాజకీయ అనుబంధం ఉందని పేర్కొన్నారు.

==========================

బెట్టింగ్ యాప్స్ కారణంగా చోటుచేసుకుంటున్న దుష్పరిణామాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్ లైన్ గేమింగ్ బిల్లు-2025 తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రకాశం జిల్లా యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎంతో మంచి పరిణామమని వారు ఆకాశవాణికి తెలిపారు. యువతను పెడదారి పెట్టించి మోసం చేస్తున్న ఆన్ లైన్ గేమ్స్‌కు అడ్డుకట్ట వేయడం ఆహ్వానించదగ్గ నిర్ణయమని పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

==========================

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కృష్ణా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో 8 కిలోమీటర్ల సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆర్. గంగాధర్ రావు పాల్గొని పోలీసు సిబ్బందితో పాటు సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతీ ఆదివారం నూతన ఇతివృత్తంతో ఫిట్ ఇండియా కార్యక్రమాలు జిల్లాలో చేపడుతున్నామని ఎస్పీ తెలి పారు.

==========================

వాయువ్య బంగాళాఖాతం, ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో రానున్న 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల వరకూ నెలకొనే వాతావరణ పరిస్థితులను వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================
==========================